క్లుప్తంగా

రాములోరికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

రాజాం: మండలంలో పెనుబాక గ్రామంలో జెడ్పీటీసీ బండి నర్శింహులు ఆధ్వర్యంలో రామయ్యతండ్రి సంబరాలు ఆదివారం వైభవంగా జరిగాయి. బండి, బింగి, సిమ్మ, అల్లు తదితర కుటుంబాలకు చెందినవారు భక్తిశ్రద్ధలతో సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొని రాములోరి ఘటాలకు పూజలు చేశారు. వారితో పాటు వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, పెనుబాక సర్పంచ్ బండి బోడమ్మ, మాజీ సర్పంచ్ బింగి కృష్ణ, ఎంపీటీసీ బింగి కోటేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

రూ.కోటితో దేవీ ఆలయ నిర్మాణం


లక్ష్మీపురంలో నిర్మిస్తున్న దుర్గాదేవి ఆలయం

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో కోటి రూపాయలతో దుర్గాదేవి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో ప్రతిష్ఠా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సర్పంచ్ కెంబూరు తేజ వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామస్తులు, దాతల సహకారంతో సర్వాంగ సుందరంగా ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.

వైభవంగా ప్రతిష్ఠా కార్యక్రమాలు


విగ్రహాలకు అభిషేకాలు చేస్తున్న వేదపండితులు

రాజాం: మండలంలో మొగిలివలస గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు జలాధి స్నానాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. మొగిలివలస గ్రామంతో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి కష్టాలు


మజ్జిరాముడుపేటలో ఏర్పాటు చేసిన కుళాయిలు

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట, అప్పాపురం, బుడితిపేట, ఉనుకూరు, సోమరాజుపేట, వప్పంగి తదితర గ్రామాల్లో ప్రజలకు తాగునీటి కష్టాలు తీరాయి. జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేసి తాగునీటిని పూర్తి స్థాయిలో అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తాగునీరు లేక ప్రజలు నానా అవస్థలు పడేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో కూడా జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే నిధులు కూడా మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్ తెలిపారు.

నాణ్యత లోపిస్తే చర్యలు


పెట్రోల్ బంక్‌లో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ డోల రాజేశ్వరరావు

తెర్లాం: పెట్రోల్ విక్రయాలకు సంబంధించి కొలతల్లో తేడాలున్నా, నాణ్యత లోపించినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. తెర్లాం జంక్షన్‌లో గల హిందూస్థాన్ పెట్రోలియం కంపెనీకి చెందిన పెట్రోల్ బంక్‌ను సీఎస్‌డీటీ గాడి భాస్కరరావుతో కలిసి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పెట్రోల్ నాణ్యతను, ధరలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ పెట్రోల్ నాణ్యత, కొలతల్లో ఎటువంటి తేడాలుండకూడదన్నారు.

నేడు మండల సమావేశం

సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి తెలిపారు. ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకులను విమర్శించడం తగదు

- మా సొంత భూమిలో కోనేరు తవ్వుకున్నాం
- నేడు పూడుస్తున్నాం..
- సాలాది వారి కుటుంబ వారసులు


మీడియాతో మాట్లాడుతున్న సాలాది అప్పలనాయుడు, లక్ష్మునాయుడు, సత్యనారాయణ

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి వద్ద గల సాలాది వారి కోనేరును మట్టితో పూడ్చివేస్తున్న విషయంలో వైఎస్సార్‌సీపీ నాయకులకు ఏ విధమైన సంబంధం లేదని కోనేరు యజమానులు సాలాది అప్పలనాయుడు, సాలాది సత్యనారాయణ, సాలాది లక్ష్మునాయుడు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, కోనేరు పూడ్చివేతకు సంబంధించి టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు. సుమారు 80 ఏళ్ల కిందట కాంద్రంగి సన్యాసమ్మ వారసుల వద్ద మా తాతలు సర్వే నంబరు 431లో 5 ఎకరాలపైబడి స్థలం కొనుగోలు చేశారని చెప్పారు. ఆ స్థలంలో చేపల పెంపకం కోసం కోనేరు తవ్వుకున్నామని, ఇప్పుడు అవసరం లేక పూడుస్తున్నామని తెలిపారు. ఆ స్థలం ప్రస్తుతం మా అధీనంలో ఉన్నప్పటికీ, రికార్డుల్లో మాత్రం కాంద్రంగి వారి పేరు మీద ఉండడంతో మా పేరు మీద మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అంతే తప్ప వైఎస్సార్‌సీపీ నాయకులకు, కోనేరు పూడ్చివేతకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరుల అండతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కోనేరును పూడుస్తున్నారని ఆరోపించడం తగదన్నారు. కొట్టక్కికి చెందిన టీడీపీ నాయకుడు ముళ్ల రాంబాబు తమ వద్దకు వచ్చి కోనేరున్న స్థలాన్ని తనకు విక్రయిస్తే మొత్తం రికార్డులు మార్చేస్తానని చెప్పాడని, అయితే అతడితో బేరం కుదరకపోవడంతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. కొట్టక్కిలోని ముళ్ల వీధిలో రాంబాబు తల్లిదండ్రులతో పాటు ఎవరిని అడిగినా ఆ కోనేరు సాలాది వారిదని చెబుతారని తెలిపారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన దేవులపల్లి వెంకటేష్ మృతికి కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, అతని కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మెయిన్ రోడ్డు నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. వెంకటేష్‌ను హత్యచేసిన వారిపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేసి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే గత నెల 19న వెంకటేష్ అదృశ్యంపై కేసు నమోదైనప్పటికీ దర్యాప్తులో నిర్లక్ష్యం వహించిన సీఐ, ఎస్సైలపై చర్యలు తీసుకోవాలన్నారు. మృతుని కుటుంబానికి న్యాయం జరగకుంటే తమ ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి


విద్యార్థినితో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నతనం నుంచి పుస్తక పఠనం అలవర్చుకోవడం ఎంతో మంచిదన్నారు. ఏయే పుస్తకాలు చదవాలో వివరించారు. విద్యార్థులంతా లైబ్రరీలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

కంప్యూటర్ విజ్ఞానం తప్పనిసరి

బాడంగి: విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు కంప్యూటర్ విజ్ఞానం తప్పనిసరని గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయానికి వచ్చిన వారికి కంప్యూటర్ పరిజ్ఞానం నేర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పింఢ్రంగివలస హెచ్‌ఎం వై. రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఆస్పత్రి అభివృద్ధి పనులు


నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనం

బాడంగి: మండల కేంద్రంలో ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి భవనం పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతమున్న 30 పడకల ఆస్పత్రిని 50 పడకల స్థాయికి అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతానికి మెటర్నిటీ, పేషంట్ల వార్డులపై అదనపు భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. పాత ఆస్పత్రి ఓపీ గదుల స్థానంలో కొత్త భవనం నిర్మాణ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి. పాత భవనాలను కొట్టేయడంతో డాక్టర్లందరూ ఒకే రూమ్‌లో ఓపీ నిర్వహిస్తున్నారు. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. గదుల్లేకపోవడంతో ఎక్స్‌రే ప్లాంట్, డెంటల్‌మిషన్, తదితర పరికరాలను వినియోగించేందుకు అవకాశం లేకుండా పోయింది. అలాగే ఇన్ పేషెంట్ రోగుకు గదులు చాలకపోవడంతో వరండాలో చికిత్సలు అందిస్తున్నారు. భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటిండెంట్ రాజారమేష్ వద్ద ప్రస్తావించగా.. సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నప్పటికీ, వసతి సమస్య ఉందన్నారు. త్వరలోనే భవన నిర్మాణాలు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తల వినతి


ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రామభద్రపురం: ఇప్పటి వరకు సాలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న మండలంలోని మూడు అంగన్‌వాడీ సెక్టార్లను బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో విలీనం చేయకుండా బొబ్బిలి ప్రాజెక్ట్ పరిధిలో విలీనం చేయాలని ఆయా సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన సరుకులను బాడంగి నుంచి తెచ్చుకునేందుకు ఇబ్బందులెదురవుతాయని తెలిపారు. బొబ్బిలి ప్రాజెక్ట్‌లో విలీనం చేస్తే అన్నివిధాలుగా బాగుంటుందనిన అభిప్రాయపడ్డారు. దీనికి ఎంపీపీ స్పందిస్తూ, సమస్యను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎంపీపీని కలిసిన వారిలో జి.చెంచులక్ష్మి, కె. రమణి, ఎస్. రాజేశ్వరి, బి.ఓ లక్ష్మి, బి. భవానీ, తదితరులున్నారు.

సాహిత్యమే చరిత్రకు పునాది


మాట్లాడుతున్న దామోదర వెంకటసూర్యారావు

రాజాం సిటీ: సాహిత్యమే చరిత్రకు ఆధారాలు అని సాహితీవేత్త డాక్టర్ దామోదర వెంకట సూర్యారావు అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 8వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విస్మృత కళింగాంధ్ర సాహితీ ప్రభ అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం దామోదర వెంకట సూర్యారావు మాట్లాడుతూ కనుమరుగైపోయిన కళింగాంధ్ర కవులు, రచయితల సాహిత్యాన్ని ఈ పుస్తకంలో పొందుపర్చడం జరిగిందన్నారు. ఇలాంటి సాహిత్య చరిత్రల ద్వారానే ఆయా ప్రాంతాల చరిత్ర బహిర్గతమవుతుందన్నారు. ప్రాంతీయ అస్తిత్వాన్ని నిలపాలంటే ఆ ప్రాంతంలోని సాహిత్యాన్ని కూడా వెలికి తీయడం, వర్తమాన సాహిత్యాన్ని గ్రంథస్తం చేయాలని అన్నారు. అనంతరం రచయితల వేదిక సభ్యులు వెంకట సూర్యారావును సన్మానించారు. కార్యక్రమంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, డాక్టర్ కణుగుల సుధీర్, అట్టాడ అప్పనాయుడు, గంట్యాడ గౌరునాయుడు, తుర్లపాటి రాజేశ్వరి, రామవరపు వెంకటరమణమూర్తి, గార రవిప్రసాద్, సూర్యశైలజ, గార సీతారత్నం, పిల్లా తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నిషేధం అంతంతమాత్రమే..!

- పంచాయతీల్లో విచ్చలవిడిగా పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగం


రామభద్రపురం రహదారి పక్కన పోగులు పడిన పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలు

రామభద్రపురం: మండలంలోని పంచాయతీల్లో పాలిథిన్, ప్లాస్టిక్ నిషేధం అంతంతమాత్రంగానే అమలవుతోంది. గతేడాది నుంచి ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువుల వినియోగం, విక్రయాలను ప్రభుత్వం నిషేధించింది. అయితే మండలంలో నిషేధం పూర్తి స్థాయిలో మాత్రం అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికీ దుకాణాలు, దాబాలు, హోటళ్లు, కూరగాయల దుకాణాలు, కిరాణా షాపుల్లో యథేచ్ఛగా పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్నారు. అలాగే మండల కేంద్రంలోని అన్ని దుకాణాల్లో పాలిథిన్ కవర్లు దర్శనమిస్తున్నాయి. గతంలో పలువురు అధికారుల ప్లాస్టిక్ నిషేధంపై వినియోగదారులు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. అయినప్పటికీ ఫలితం కానరాలేదు. పాలిథిన్ కవర్లు, కప్పులు వినియోగించి ఎక్కడబడితే అక్కడ పారబోస్తుండడంతో పర్యావరణానికి పెనుముప్పు తప్పదని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఈఓఆర్‌డీ వెంకటరమణ వద్ద ప్రస్తావించగా మండలంలో ప్లాస్టిక్, పాలిథిన్ నిషేధం అమలు చేస్తున్నామన్నారు. ఇక నుంచి విక్రయాలపై మరింత దృష్టి సారిస్తామన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం


కోలాటం ఆడుకున్న చిన్నారులు

వంగర: మండలంలోని రాజులగుమ్మడ గ్రామంలో శివరాత్రి సందర్భంగా శనివారం రాత్రి ఏర్పాటు చేసిన చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు లయబద్ధంగా కోలాటం ఆడుతూ గ్రామస్తులను అలరించారు. వారికి కోలాటం నేర్పించిన ఉపాధ్యాయురాలు నీలవేణిని గ్రామస్తులు అభినందించారు.

అతివేగం వల్లే ప్రమాదాలు


ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేంద్రనాయుడు

రామభద్రపురం: అతివేగం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్సై సురేంద్రనాయుడు అన్నారు. స్థానిక జాతీయ రహదారిపై వాహన చోదకులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలిగినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేసినా, అతివేగంతో రాకపోకలు సాగించినా విలువైన ప్రాణాలు కోల్పోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మినీ వాటర్ ట్యాంకుల ఏర్పాటు


ఆస్పత్రి ఆవరణంలో ఏర్పాటుచేసిన మినీ వాటర్ ట్యాంక్

రాజాం: పట్టణ కేంద్రంలో ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద రెండు వాషింగ్ ట్యాంకులు అధికారులు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కంబాల జోగులు సూచనల మేరకు ఆస్పత్రి అభివృద్ధి నిధులు రూ.50 వేలుతో వీటిని ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. పేషెంట్లు, డాక్టర్లు, ఆస్పత్రికి వచ్చేవారు తమ చేతులు, ముఖం శుభ్రం చేసుకునేందుకు ఈ ట్యాంకులు ఉపయోగపడతాయన్నారు.

సామూహిక రుద్రాభిషేకాలు


రుద్రాభిషేకాలు చేస్తున్న భక్తులు

రాజాం: పట్టణంలో అమ్మవారి కాలనీలో ఉన్న సీతారామ మందిరంలో శనివారం రాత్రి మహాన్యాసపూరక రుద్రాభిషేకాలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా అఖండ దీపారాధన, 48 మంది దంపతులతో అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ వెల్లడించింది.

అమ్మవారి ఘటాల ఊరేగింపు


పారాదిలో ఘటాల ఊరేగింపు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాదిలో ఈ నెల 28న నిర్వహించనున్న 13 గ్రామాలకు చెందిన పాతపోలమ్మ, కొత్తపోలమ్మ, నూకాలమ్మ జాతరలకు సందర్భంగా అమ్మవారి ఘటాలకు ఆదివారం పూజలు చేసి ఊరేగించారు. పారాది, నారాయణప్పవలస, కాశిందొరవలస, భోజరాజపురం, తదితర గ్రామాల్లో ఘటాలకు పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజుపేటలో అమ్మవారి సంబరాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని రాజుపేటలో దేశమ్మ తల్లి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, న్యాయవాది రుంకాన ప్రసాద్, దిబ్బగుడ్డివలస సర్పంచ్ చింతల రామారావు, అల్లు త్రినాథ, తదితరులు పాల్గొని పూజలు చేపట్టారు.

డొమెస్టిక్ గ్యాస్ పక్కదారి


రాజాం పట్టణంలో హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లుకు తరలిపోతున్న గ్యాస్ సిలిండర్లు

రాజాం సిటీ: సామాన్యులకు కట్టెల పొయ్యి దూరం కావడంతో డొమెస్టిక్ వంటగ్యాస్ వాడకం అనివార్యమైంది. అయితే రాజాం పట్టణంలో కొంత మంది గ్యాస్ డీలర్లు, డెలివరీ బాయ్స్ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నారు. గృహ వినియోగదారులకు అందాల్సిన గ్యాస్ సిలిండర్లు అక్రమంగా హోటల్స్, టిఫిన్‌షాప్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు తరలిపోతున్నాయి. కేజీ కమర్షియల్ వంట గ్యాస్ సిలిండర్ రూ.98లు ఉండగా, డొమెస్టిక్ గ్యాస్ రూ.77లు ధర పలుకుతోంది. డొమెస్టిక్ వంటగ్యాస్ హోటల్స్‌కు తరలిపోవడంతో సామాన్యులకు అందాల్సిన గ్యాస్ సబ్సిడీ అందడం లేదని విమర్శలున్నాయి. సివిల్‌సప్లయ్, విజిలెన్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో గ్యాస్ సిలిండర్ల సరఫరా పక్కదారి పడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమాలను అరికట్టి, సామాన్యులకు రాయితీ సిలిండర్లు చేరేలా చర్యలు తీసుకోవాలని పవులురు కోరుతున్నారు.

పాల్తేరులో భారీ అన్నసమారాధన


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

బాడంగి: మండలంలోని పాల్తేరులో శివరాత్రి నేపథ్యంలో శనివారం రాత్రి పార్వతీ సమేత మల్లికార్జున స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు. పాల్తేరుతో పాటు అలజంగి, మల్లంపేట, బొత్సవానివలస, రావివలస, భీమవరం, తదితర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పార్వతీ,మల్లికార్జున ఉత్సవ మూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఉడమల అప్పలనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వంగపండు జోగినాయుడు, ఎంపీటీసీ ప్రతినిధి రమేష్, గోపాలనాయుడు పాల్గొన్నారు.

గృహసారథుల సమావేశం రేపు


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రేగిడి: మండలంలోని తాటిపాడు జంక్షన్ వద్ద ఉన్న వాటర్ ప్లాంట్‌లో ఈ నెల 21న ఉదయం 9 గంటలకు గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు తెలిపారు. రేగిడిలో ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ..ఇటీవల నియమించిన కన్వీనర్లు, గృహసారథులు చేపట్టాల్సిన విధి, విధానాలపై ఈ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. వారితోపాటు ఉంగరాడ ఎంపీటీసీ పిల్లా గౌరినాయుడు, అప్పాపురం సర్పంచ్ కరణం శ్రీనివాసరావు ఉన్నారు.

జీవామృతంతో పంటకు మేలు


అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: రసాయన ఎరువులకు బదులు జీవామృతాన్ని వినియోగించి పంట తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని చాటాయవలస గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీ విధానంపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. ఆవు మూత్రం 10 లీటర్లు, పొగాకు కిలో, వెల్లుల్లి అరకిలో, పచ్చిమిర్చి అరకిలో, వేపాకులు 5 కిలోలు ఒక మట్టి కుండలో వేసి పది లీటర గోమూత్రం వేసి బాగా కలిపి, దాన్ని మరగబెట్టిన తరువాత పలుచని గుడ్డలో వడకట్టి డబ్బాలో వేసి మూడు నెలల వరకు ఉపయోగించుకోవచ్చన్నారు. ఎకరానికి 5 లీటర్ల అగ్నిఅస్త్రం 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయనతోపాటు సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, ప్రకతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంగాంలో పోటెత్తిన భక్తులు


సంగమేశ్వరుని దర్శనానికి బారులుతీరిన భక్తులు

వంగర: పవిత్ర పుణ్యక్షేత్రం సంగాంలో వెలసిన సంగమేశ్వరస్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వేగావతి, సువర్ణముఖి, నాగావళి నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న 400 ఏళ్ల నాటి భారీ మర్రిచెట్టు కింద వంటా వార్పు చేసి త్రివేణి సంగమంలో పిండప్రదానాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ, పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ముగిసిన శివరాత్రి సంబరాలు


చిత్రకోటపర్వతంపై భక్తుల సందడి


దేవుడి బొడ్డవలసలో రెండోరోజు పూజలు చేస్తున్న భక్తులు


ఓంశాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శివరాత్రి పూజలలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు



చిన్నారుల శివతాండవ ప్రదర్శన

బొబ్బిలి రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. శనివారం రాత్రి జాగారాలు చేసిన భక్తులు ఆదివారం వేకువజామున ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. పెంట, పిరిడి, పారాది శివాలయాలలో ప్రత్యేక పూజలు, శివ, పార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కలువరాయి రమణ మహర్షి ఆశ్రమం, దేవుడిబొడ్డవలస మానసాదేవి ఆలయంతో పాటు చిత్రకోట పర్వతంపై కొలువైన శివాలయం భక్తులతో కిటకిటలాడింది. అలాగే జగన్నాథంలో ఈదుబిల్లి జగన్నాథస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన శివరాత్రి సంబరాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, బీకే రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. సంబరాల్లో భాగంగా చిన్నారుల శివతాండవ ప్రదర్శన ఆకట్టుకుంది.